
# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 3 నవంబర్ 2025 | పేజీలు 8


# 'వర్టెక్స్' భారీ అక్రమ షెడ్డుకు..! అనుమతులేవి "టిపిఎస్" గారు

- చర్యలకు ఆకుల సతీష్ డిమాండ్..! నిర్లక్ష్యం వహిస్తే మూల్యం తప్పదు..
- నిర్లక్ష్యపు నీడలో దుండిగల్ మున్సిపల్ అధికారుల విధుల నిర్వహణ..
- అక్రమ షెడ్లు-నిర్మాణాల కోసమే అన్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి విధులు..!
- బడా నిర్మాణ సంస్థకు మినహాయింపు..! ఇలాంటి అధికారులు అవసరమా..?
- కాసులు కురిపించే బడా నిర్మాణ సంస్థలకు, భారీ అక్రమ కట్టడాలకు టిపిఎస్ అండ..?
- ఉత్సవ విగ్రహంలా మున్సిపల్ కమిషనర్,
- అక్రమ నిర్మాణాల నియంత్రణలో విఫలం..
- పైనుండి (లోకల్‌బాడీ) ఒత్తిడి లేదు.. సిఫార్సులకు కొరత లేదు..?
- ధనార్జనే ధ్యేయంగా, పార్కు స్థలాలను సైతం కబ్జాదారులకు ధారాదత్తం..
- ప్రజల సొమ్ముతో వేతనాలు.. నేతల సిఫార్సులంటూ ప్రమాదకర కట్టడాలు..
- మున్సిపల్ అధికారులకు "బాధ్యత ఉందో లేదో"..? ఉన్నతాధికారులే తేల్చాలి..


దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజనా..

## శంభీపూర్‌లో టిజి-బిపాస్ చట్టాన్ని ఉల్లంఘించి షెడ్డు నిర్మాణం..

దుండిగల్ మున్సిపాలిటీలో అధికారుల విధుల నిర్వహణ ప్రజలను ప్రమాదంలో పెడుతుంది.. టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ,అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు.. అధికారుల తీరుపై పలువురికి ఆగ్రహం తెప్పిస్తున్న వైనం.. ప్రమాదాలను నివారించే నిబంధనలు పాటించకుండా..! నిధులు సమకూరితే చాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారు.. నిబంధనలకు తిలోదకాలు పలికి, మున్సిపల్ వ్యాప్తంగా అక్రమ షెడ్లు, అక్రమ కట్టడాలతో పేరుకు పోయింది.. విజిలెన్స్ వ్యవస్థను కూడా మున్సిపల్ అధికారులు మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం..

దుండిగల్, పెన్ పవర్, నవంబర్ 2:

-2 లో


మల్లంపేట్ శంభీపూర్ సర్వే నెం.30లో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

# పేదల ఇళ్లు కూల్చేసి..! పెద్దల భూములు కాపాడుతున్నారా..?

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ 11 ఎకరాల కబ్జాను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు..
- హైడ్రా అధికారులు ద్వంద్వ వైఖరిపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు..
- పేదలకో న్యాయం..! ప్రభుత్వ పెద్దలకో న్యాయమా..? అంటూ ఆగ్రహం..
- పెద్దల పాలిట "రక్షకులు"..! పేదల పాలిట "భక్షకులు"..! హైడ్రా అధికారులపై ధ్వజం..
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు 307లో పర్యటన..
- రూ.1100 కోట్లు విలువైన భూమి కబ్జాను కూల్చేసిన వెంటనే మళ్ళీ ఫెన్సింగ్..
- కాంగ్రెస్ ప్రభుత్వం 270 ఇండ్లను కూల్చేసి పేదలను రోడ్డున పడేసిందని ఆగ్రహం..
- పేదల ఇళ్ళను కూల్చేసి, పెద్దలకు కట్టబెడుతున్నారని విమర్శలు..
- ఎమ్మెల్యే గాంధీ పార్టీ మారినందుకు నజరానాగా 307 భూమిని కట్టబెట్టారా..?

-3 లో



# దమ్ముంటే.. సన్నబియ్యం పథకం ఆపి చూడండి



హైదరాబాద్ పెన్ పవర్:జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాజపాను విమర్శించి మజ్లిస్ ఓట్లు పొందాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వెయ్యకపోతే సన్నబియ్యం రద్దవుతాయని ప్రజలను సీఎం బెదిరిస్తున్నారని

-4 లో

# 'వర్టెక్స్' భారీ అక్రమ షెడ్డుకు..! అనుమతులేవి "టిపిఎస్"గారు..!



దుండిగల్ మున్సిపల్ డి.పోచంపల్లిలో కాంగ్రెస్ నేత అక్రమ షెడ్డు..

బౌరంపేట్ డిపిఎస్ రోడ్డులో..






బౌరంపేట్ సింహపురి కాలనీ

బౌరంపేట్ సింహపురి కాలనీ..




## టౌన్‌ప్లానింగ్ అధికారి అండతో ఈ అక్రమ షెడ్లు- అక్రమ నిర్మాణాలు "..



బౌరంపేట్ పరిధిలో..




గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి హాస్టల్ నిర్వహణకి అక్రమ కట్టడం..




గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో హాస్టల్ నిర్వహణకు.. టిపిఎస్ అనుగ్రహం..



టిపిఎస్ అనుగ్రహంతో గాగిల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుని పేకమేడ..

## అధికారుల మౌనానికి అర్థం..?

అనుమతులు లేకుండా మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంటే.. మున్సిపల్ అధికారులు స్పందించక పోవడం ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. దుండిగల్ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కళ్లముందే భారీ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి..!ఇదంతా అధికారుల సహకారం లేకుండా సాధ్యమేనా..? ఈ వర్టెక్స్ కంపెనీ షెడ్డుకు బీఆర్ఎస్ సోదరుల సిఫార్సులు కూడా ఉండవచ్చని భాస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని శంబిపూర్ గ్రామ శివారు, సర్వే నెంబర్ 30లో, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్డుపై మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి అంతగా సహకరించడానికి కారణం..? ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోక పోవడానికి కారణం..? ముడుపులు దండిగా ఇవ్వగలిగే బడా నిర్మాణ సంస్థ అయి ఉండవచ్చని పలువురు భావించిన విధంగానే జరిగింది.. అధికారులే రక్షణ వలయంగా మారిన ఆ అక్రమ షెడ్డు ఓ బడా నిర్మాణం సంస్థకు చెందినది అంటూ, ఆకుల సతీష్ శనివారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.. ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపల్ పరిధి శంభీపూర్ గ్రామ పరిధి సర్వే నెం.30లో ఉన్నదే 00-32 గుంటల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్శన్ కూడా లేకుండానే..! "వర్టెక్స్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ" భారీ అక్రమ షెడ్డును నిర్మించిందని సతీష్ ఫిర్యాదులో పేర్కొన్నారు..

ఈ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్, హెచ్.ఎం.డి.ఏ అనుమతి ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.. అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.. తెలంగాణ మున్సిపల్ చట్టం - 2019కి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు..

## చట్టాన్ని ఉల్లంఘించి..

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 178 (2, 3, 4, 5) ప్రకారం ఎవరైనా అనుమతి లేకుండా భవనం నిర్మిస్తే, మున్సిపల్ అధికారులు ఆ నిర్మాణాన్ని తక్షణం కూల్చివేసే అధికారం ఉంది. అయితే ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమతులు రేకెత్తిస్తుంది..

శంబిపూర్‌లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణం కేవలం ఒక షెడ్డు సమస్య మాత్రమే కాదు.. పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన నగరపాలక సంస్థల చట్టాల అమలు వైఫల్యానికి సూచికగా పేర్కొనవచ్చు.. దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 7-8 ఏళ్ళు గడిచినా, అధికారుల్లో పారదర్శకత లోపిస్తుంది.. ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వర్తించడం పరిపాటిగా మారింది.. ఈ వర్టెక్స్ కంపెనీకి చెందిన అక్రమ షెడ్డు మాత్రమే కాదు.. టౌన్‌ప్లానింగ్ అధికారుల ఖాతలో నేటికీ చర్యలు తీసుకోని మరికొన్ని అక్రమ షెడ్లు అక్రమ, నిర్మాణాలను, నేటి "పెన్ పవర్" దినపత్రికలో పాఠకుల కోసం.. దుండిగల్ మున్సిపల్ అధికారుల "కరెప్షన్ అంటారో- లేక నేతల సిఫార్సుల ముందు, టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని చెబుతారో ప్రజలు గమనించాలి.. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా..! కరెప్షన్ అధికారుల తీరు మారకపోవడం బాధాకరం..

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కబ్జాను సందర్శించిన గులాబీ దండు..






# పేదల ఇళ్లు కూల్చేసి..! పెద్దల భూములు కాపాడుతున్నారా..?

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ 11 ఎకరాల కబ్జాను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు..



గాజులరామారం సర్వే నెం.307 ప్రభుత్వ భూమిలో బీఆర్ఎస్ నేతలు..

- హైడ్రా అధికారులు ద్వంద్వ వైఖరిపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు..
- పేదలకో న్యాయం..! ప్రభుత్వ పెద్దలకో న్యాయమా..? అంటూ ఆగ్రహం..
- పెద్దల పాలిట "రక్షకులు"..! పేదల పాలిట "భక్షకులు"..! హైడ్రా అధికారులపై ధ్వజం..
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు 307లో పర్యటన..
- రూ.1100 కోట్లు విలువైన భూమి కబ్జాను కూల్చేసిన వెంటనే మళ్ళీ ఫెన్సింగ్..
- కాంగ్రెస్ ప్రభుత్వం 270 ఇండ్లను కూల్చేసి పేదలను రోడ్డున పడేసిందని ఆగ్రహం..
- పేదల ఇళ్ళను కూల్చేసి, పెద్దలకు కట్టబెడుతున్నారని విమర్శలు..
- ఎమ్మెల్యే గాంధీ పార్టీ మారినందుకు నజరానాగా 307 భూమిని కట్టబెట్టారా..?



### హైడ్రా అధికారుల తీరుపై.. బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు..

గాజులరామారం సందర్శనలో, కూల్చేసిన ఇళ్ళవద్ద పేదలు నివసిస్తున్న సన్నివేశాలు చూసిన బీఆర్ఎస్ నేతలు హైడ్రా అధికారుల వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.. హైడ్రా అధికారులు పెద్దల పాలిట రక్షకులుగా, పేదల పాలిట భక్షకులుగా మారారని విమర్శించారు. పార్టీ పిరాయించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబానికి రూ.1100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు నజరానాగా కట్టబెడుతున్నారని బహిరంగంగానే ఆరోపించారు.. తక్షణమే గాంధీ కబ్జాలో ఉన్న భూములు స్వాధీన పరచుకుని, పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం వెంటనే 11 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, సంబంధిత భూమిలో ఇళ్లులేని పేదలకు, కూల్చివేతల బాధితులకు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, సునీత లక్ష్మారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మరియు కూకట్పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

### పేదలను రోడ్డున పడేసి.. పెద్దలకు వత్తాసుగా..

గాజులరామారం సర్వే నెం. 307 ప్రభుత్వ భూమిలో పేదలకు చెందిన 270 ఇళ్లను కూల్చిన హైడ్రా అధికారులు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కుటుంబం వేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా అధికారులు కూల్చిన వెంటనే తిరిగి నిర్మిస్తే మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు.. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఒకే చట్టం అందరికీ వర్తిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఒక నీతి, పెద్దలకు మరో నీతి అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చేసి, పెద్దలకు ప్రభుత్వ భూములను కట్టబెట్టబెడుతోందని అన్నారు.. ప్రభుత్వ భూములను బహిరంగంగా ఆక్రమించిన గాంధీ కుటుంబంపై చర్యలు తీసుకోకుండా.. పేదల ఇళ్లను నేలమట్టం చేయడం దౌర్జన్యమని పేర్కొన్నారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, నవంబర్ 2:** కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారం గ్రామం సర్వే నంబర్ 307 వద్ద 11 ఎకరాల ప్రభుత్వ భూమిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన కుటుంబ సభ్యుల పేరుతో ఆక్రమించుకున్నారని ఆరోపణలు చేస్తూ, బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు.. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు గాజులరామారంలోని 307 ప్రభుత్వ భూమిని సందర్శించారు.."పేదలకో న్యాయం%ూ% పెద్దలకు మరో న్యాయమా..?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనా అస్త్రాలు సంధించారు.. స్థలాన్ని పరిశీలించిన అనంతరం పేదల ఇళ్ళను కూల్చివేసిన, ఫోటోలను మీడియా సమావేశంలో ప్రదర్శించిన నేతలు, మాట్లాడారు.. "హైడ్రా అధికారులు పేదల ఇళ్లపై ప్రతాపం చూపి కూల్చివేస్తారు.. కానీ పెద్దల అక్రమాలను మాత్రం పట్టించుకోరని అన్నారు.. ఇది సిగ్గుమాలిన చర్యలుగా" బీఆర్ఎస్ నేతలు విమర్శించారు..







# పాపం.. ఎందుకిలా చేసిందో.. స్కూల్ ఫోర్త్ ఫ్లోర్ పై నుంచి దూకేసింది..




**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్తాన్?లోని జైపూర్‌లో విషాద ఘటన జరిగింది. ఒక ప్రైవేట్ స్కూల్?లో 6వ తరగతి చదువుతున్న బాలిక శనివారం మధ్యాహ్నం ఆ స్కూల్ ఫోర్త్ ఫ్లోర్ పై నుంచి దూకేసింది. ఈ దుర్ఘటనలో బాలిక తలకు తీవ్ర గాయం కావడంతో తీవ్ర రక్త స్రావం జరిగి స్పాట్?లోనే చనిపోయింది. ఇంత జరుగుతుంటే పాఠశాల యాజమాన్యం ఏం చేస్తుందని బాలిక తల్లిదండ్రులు స్కూల్?లో నిరసన చేశారు. యాజమాన్యంతో గొడవ పడ్డారు. ఆ బాలిక గోడపైకి ఎక్కడం, కిందకు దూకేయడం ఈ ఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ వీడియో నెట్టింట వైరల్ అయింది. దాదాపు 47 అడుగుల పై నుంచి బాలిక కిందకు దూకేసింది. ఆ బాలిక రైలింగ్ ఎక్కుతున్నా ఏం పట్టనట్టు తోటి విద్యార్థులు మెట్లు దిగుతూ కనిపించారు. ఈ ఘటన జరిగిన తీరు చూస్తుంటే.. ఆ బాలిక ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనప్పటికీ కారణం ఏంటనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

స్కూల్ యాజమాన్యం తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక పై నుంచి దూకేసిన అనంతరం హాస్పిటల్?కు తరలించిన కొద్దిసేపటికే స్పాట్?లో రక్తపు మరకలను

తుడిచేసి, ఫ్లోర్ ను కడిగేసి అక్కడ అసలు ఏం జరగనట్లు స్కూల్ యాజమాన్యం ప్రవర్తించిన తీరు అనుమానాలకు కారణమైంది. సాక్ష్యాలను చెరిపేసేందుకు స్కూల్ యాజమాన్యం ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మహత్య చేసుకుని చనిపోయిన బాలిక పేరు అమైరా. స్కూల్ పేరు నీర్జా మోదీ స్కూల్. శనివారం మధ్యాహ్నం 12.30 సమయంలో ఈ ఘటన జరిగింది.

# 9 మంది ట్రాన్స్ జెండర్లు అరెస్ట్..సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ స్పెషల్ డ్రైవ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వారం రోజులపాటు రాత్రిపూట చేపట్టిన ప్రత్యేక డ్రైవ్?లో 9 మంది ట్రాన్స్‌జెండర్లను అరెస్టు చేసినట్టు ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన తెలిపారు. రెండు పీఐటీఏ కేసుల్లో ముగ్గురు బాధితులను రక్షించి, 5 మంది నిందితులను పట్టుకున్నామన్నారు. అలాగే సైబరాబాద్ షీ టీమ్స్ కమిషనరేట్ పరిధిలో 142 డెకాయ్ ఆపరేషన్లు చేపట్టి బహిరంగ ప్రదేశాల్లో అసభ్యచర్యలకు పాల్పడిన 76 మందిని రెడ్?హ్యాండెడ్?పట్టుకున్నారు. వీరిలో 51 మంది కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కుటుంబ కౌన్సెలింగ్, సీడీ ఈడబ్ల్యూ కేంద్రాల్లో భార్యాభర్తల కుటుంబ వివాదాల్లో ఉన్న 29 కుటుంబాలను తిరిగి కలిపే ప్రయత్నాలు చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. సైబరాబాద్?లోని వివిధ ప్రాంతాల్లో మానవ, పిల్లల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లల హక్కులు, బాల కార్మికులు, యాచించడం,

సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, హెల్ప్‌లైన్‌లు (181, 1098, 100, 1930) ప్రాముఖ్యతలను వివరించామన్నారు.

# బీబీనగర్ లో రోడ్ టెర్రర్..వాకర్స్ పై దూసుకెళ్లిన థార్ వాహనం..స్పాట్ లోనే భార్యాభర్తలు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** పొద్దుపొద్దున్నే ఘోర ప్రమాదం.. వాతావరణం బాగుంది కదా అని చెరువు దగ్గర బైక్ పార్కింగ్ చేసి నిల్చోవడమే వారి ప్రాణాల మీదకు తెచ్చింది.. వేగంగా దూసుకొచ్చిన జీపు వారి పాలిట యముడిలా మృత్యువును

కబలించింది..ఆదివారం ఉదయం బీబీనగర్ చెరువు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం( నవంబర్2) బీబీనగర్ చెరువు దగ్గర థార్ వాహనం బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చిన థార్ వాహనం రోడ్డుపక్కన బైక్ పార్కింగ్ చేసి నిల్చున్న

భార్యాభర్తలపైకి దూసుకెళ్లడంతో స్పాట్ లో నే చనిపోయారు. జీపు వేగం ధాటికి ఇద్దరు ఎగిరి చెరువులో పడ్డారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు వ్యక్తులకు

తీవ్రగాయాలయ్యాయి.

గాయపడ్డవారిని చికిత్సకోసం భువనగిరి ఆస్పత్రికి తరలించారు.




## దమ్ముంటే.. సన్నబియ్యం పథకం ఆపి చూడండి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి బెదిరింపు రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సన్న బియ్యం పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందని, రాష్ట్రం వాటా కిలోకు కేవలం రూ.15 మాత్రమేనని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న ఒకే ఒక్క పథకం 'ఉచిత బస్సు' మాత్రమేనని చెప్పారు."సన్న బియ్యం పథకం కాంగ్రెస్‌ది కాదు. సీఎంకు దమ్ముంటే బియ్యం పథకం ఆపిచూడండి. బియ్యంపై కేజీకి కేంద్రం రూ.42 ఇస్తోంది. రాష్ట్రం వాటా రూ.15 మాత్రమే. సన్న బియ్యం పథకం ఎవరిదో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. దేశవ్యాప్తంగా ఉచిత బియ్యం పథకం అమలు చేస్తున్నాం. సీఎం వ్యాఖ్యలపై భాజపా తరఫున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ఓటు వెయ్యకపోతే పథకం ఆపేస్తామని బెదిరించడం ఎన్నికల నియమావళికి వ్యతిరేకం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఒరిజినల్ సంతోష్ దాబా పేరును వాడుకుంటున్న దాబాల బోర్డులు లేపేస్తున్నారు !




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ సంతోష్ దాబా పేరుతో ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించి వ్యాపారాలు నడుపుతున్న వివిధ దాబాలపై కోర్టు ఆదేశాలతో పోలీసులు చర్యలు చేపట్టారు. ఒరిజినల్ సంతోష్ దాబా యజమాని మనోజ్ కుమార్ సాంక్లా తమ పేరును దుర్వినియోగం చేస్తున్నారని సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. తమ బ్రాండ్?తో అక్రమంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శ్రీ, బాలాజీ సంతోష్ దాబా ఇలా పేర్లు పెట్టుకొని నడిపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిటీ సివిల్ కోర్టులో వేసిన కేసుపై న్యాయస్థానం స్పందిస్తూ.. అక్రమంగా పేరును దుర్వినియోగం చేస్తున్న బోర్డులను తొలగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో బేగంబజార్?లోని సంతోష్ దాబా బోర్డును గోషామహల్ పోలీసుల సమక్షంలో తొలగించారు. అక్రమంగా శ్రీ సంతోష్ దాబా పేరుతో పెట్టుకొని... నిజమైన సంతోష్ దాబా పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నారని.. మనోజ్ కుమార్ తరుపు న్యాయవాది అభిషేక్ అగర్వాల్ తెలిపారు.

హైదరాబాద్ నగరంలోని హిమాయత్ నగర్, అబిడ్స్, సోమజిగూడా, అమీర్ పెట్, అత్తాపూర్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో సంతోష్ దాబా పేరుతో అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలతో నగరంలో ఉన్న సుమారు 50 దాబాల బోర్డులను తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

## భారత క్రికెట్‌లో విషాదం.. రోడ్డు ప్రమాదంలో ఇండియా మాజీ అండర్ -15 ప్లేయర్ మరణం





హైదరాబాద్ పెన్ పవర్:భారత క్రికెట్ లో విషాదం చోటు చేసుకుంది. అండర్-19 వరల్డ్ కప్ లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించిన త్రిపుర మాజీ ఆల్ రౌండర్ రాజేష్ బానిక్ మరణించాడు. పశ్చిమ త్రిపురలోని ఆనందనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించినట్లు అధికారులు శనివారం (నవంబర్ 2) తెలిపారు. శుక్రవారం (అక్టోబర్ 31) ఆయన మరణం రాష్ట్ర క్రికెట్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. "ప్రతిభావంతుడైన క్రికెటర్‌ను.. అండర్-16 క్రికెట్ జట్టు సెలెక్టర్‌ను మనం కోల్పోవడం చాలా దురదృష్టకరం. మేము దిగ్భ్రాంతికి గురయ్యాము. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి" అని త్రిపుర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్రత దే విలేకరులతో అన్నారు. 1984న అగర్తలాలో జన్మించిన బానిక్.. 2002-03 సీజన్‌లో త్రిపుర తరపున రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. రైట్ హ్యాండర్ బ్యాటర్ తో లెగ్ బ్రేక్ స్పిన్ కూడా వేయగలడు. 42 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఈ త్రిపుర క్రికెటర్ 19.32 యావరేజ్ తో 1,469 పరుగులు చేశాడు. వీటిలో ఆరు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 93. అతను 24 లిస్ట్ ఏ మ్యాచ్ ల్లో 378 పరుగులు చేశాడు. ఇందులో ఒక అజేయ సెంచరీ (101*) కూడా ఉంది. త్రిపుర తరపున 18 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.త్రిపుర క్రికెట్ అసోసియేషన్ శనివారం తన ప్రధాన కార్యాలయంలో మాజీ క్రికెటర్‌కు నివాళులర్పించింది, రాష్ట్ర క్రికెట్ సెటప్‌పై శాశ్వత ప్రభావాన్ని చూపిన అంకితభావంతో కూడిన ఆటగాడిగా, గురువుగా ఆయనను గుర్తుచేసుకుంది. త్రిపుర స్పోర్ట్స్ జర్నలిస్ట్ క్లబ్ కార్యదర్శి అనిర్బన్ దేబ్ మాట్లాడుతూ, బానిక్ సహకారం మైదానంలో అతని ప్రదర్శనలకు మించి ఉందని అన్నారు. క్రికెట్ కెరీర్ తర్వాత బానిక్ త్రిపుర అండర్-16 జట్టుకు సెలెక్టర్‌గా పనిచేశాడు.

## హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు


హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకో న్యాయం, పెద్దోళ్లకో న్యాయమనే రీతిలో పనిచేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో హైడ్రా విధ్వంసం సృష్టిస్తోందని మండిపడ్డారు. హైడ్రా చర్యలపై ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో నిర్మాణాలు మాత్రమే కనిపిస్తాయి.. కానీ కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలే కనిపిస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సచివాలయం, టీహబ్, వీహబ్, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మించామని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంలో 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించామని మాజీ మంత్రి చెప్పారు.

**పేదల పైనే హైడ్రా ప్రతాపం..**

ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో హైడ్రా పేదవాళ్ల ఇళ్లను కూల్చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల అన్యాయం జరిగిన వారికి బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమించిన పెద్దోళ్ల విషయంలో హైడ్రా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

# యూట్యూబర్ హర్ష సాయి పేరుతో సైబర్ స్కాం.. ఇరాక్ లో జగిత్యాల యువకుడికి టోకరా..

హైదరాబాద్ పెన్ పవర్:ఇరాక్ లో సైబర్ మోసానికి జగిత్యాల యువకుడు బలయ్యాడు. యూట్యూబర్ హర్ష సాయి పేరుతో యువకుడి నుంచి రూ. 87 వేలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన రాకేశ్ జీవనోపాధి కోసం ఇరాక్ వెళ్ళాడు. పదిరోజుల కోసం ఇరాక్ వెళ్లిన రాకేష్ ఫేస్ బుక్ లో ఒక పోస్టును లైక్ చేశాడు. ఆ తర్వాత యూట్యూబర్ హర్ష సాయి పేరుతో నకిలీ ప్రొఫైల్ ద్వారా రాకేష్ తో పరిచయం పెంచుకున్నారు ముఠా సభ్యులు. నమ్మించేందుకు హర్ష సాయి పేరుతో ఉన్న ఆధార్ కార్డు కాపీని పంపించారు ముఠా. అప్పులు తీర్చడానికి ఐదు లక్షలు సహాయం చేస్తాం అని చెప్పి నమ్మించారు ముఠా సభ్యులు. తరువాత ఫోన్‌పే ద్వారా 6లక్షల 50వేలు పంపినట్టు నకిలీ స్క్రీన్‌షాట్లు పంపి మోసం





చేశారు కేటుగాళ్లు. డబ్బులు అందకపోవడంతో రాకేష్ ప్రశ్నించగా ఫండ్ విడుదల కావాలంటే టాక్స్ చెల్లించాలని నమ్మించారు మోసగాళ్లు. గుడ్డిగా నమ్మిన రాకేష్ ఇండియాలో ఉన్న తన కుటుంబ సభ్యుల ఖాతాల నుండి విడతల వారీగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా మొత్తం 87 వేలు పంపించాడు.ఆ తర్వాత ఇంకా డబ్బులు డిమాండ్ చేసిన కేటుగాళ్లు చెల్లించకపోతే డిజిటల్ అరెస్ట్ చేస్తామని.. కఠిన శిక్ష పడుతుందని బెదిరించారు సైబర్ ముఠా.డిజిటల్ అరెస్ట్ కు సంబంధించిన కొన్ని ఫేక్ వీడియోలు రాకేష్ కు పంపించి బెదిరించారు సైబర్ ముఠా. ఆ వీడియోలు చూసి భయపడిపోయాడు రాకేష్. మోసపోయానని గుర్తించిన రాకేష్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఫలితాల విడుదల.. కర్ర రాజశేఖర్ ప్యానెల్ ఘన విజయం..







హైదరాబాద్ పెన్ పవర్:కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల ఫలితాలు విడుదల య్యాయి. 12 స్థానాలకు గాను జరిగిన ఈ ఎన్నికల్లో 54 మంది అభ్యర్థులు పోటీ పడగా.. వీరిలో 10 మంది గెలుపొందారు. కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్లు కర్ర రాజశేఖర్, గడ్డం విలాస్ రెడ్డి ప్యానెళ్ల మధ్య తీవ్ర పోటీ నడవగా.. కర్ర రాజశేఖర్ రెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. కర్ర రాజశేఖర్ ప్యానెల్ నుండి పోటీ చేసిన 12 మందిలో పోటీ చేయగా 9 మంది రాజశేఖర్ ప్యానెల్, ఒకరు ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. 10 మంది గెలుపొందారు.ఇక జనరల్ కేటగిరిలో కర్ర రాజశేఖర్, దేశ వేదాద్రి, కన్నా సాయి, ఆనందం, సాయి కృష్ణ, అను రాస్, లక్ష్మణ్, రాజు,దీపక్, కిషన్ గెలుపొందారు. మహిళా క్యాటగిరిలో వరాల జ్యోతి, ముద్దసాని శ్వేతా గెలుపొందగా... ఎస్సి, ఎస్టీ కేటగిరిలో సరిల్ల రతన్ రాజు గెలుపొందారు.వెలిచాల రాజేందర్ రావు ప్యానెల్ నుంచి ఇద్దరు మాత్రమే గెలుపొందారు. మొన్నటి వరకు ఛైర్మన్ గా ఉన్న గడ్డం విలాస్ రెడ్డి సహా అయన ప్యానెల్ లో ఉన్న వారందరు ఓటమి చెందారు. అర్బన్ బ్యాంకులో మొత్తం 9వేల 287 మంది సభ్యులకు ఓటు హక్కు ఉన్నప్పటికీ కేవలం 4 వేల 114 మంది మాత్రమే ఓటు వేశారు. కరీంనగర్ లో 3,342 మంది, జగిత్యాలలో 772 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 4 వేల 114 మంది ఓటు వేయగా.. 44.26 శాతం పోలింగ్ నమోదైంది. విజయం సాధించిన ప్యానెల్ ఆనందోత్సాహాలతో మునిగిపోయింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వారిలో ముగ్గురు బీజేపీ అభ్యర్థులున్నారు. వీరికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. కర్ర రాజశేఖర్ ప్యానెల్ కు మొదటి నుంచి బండి సంజయ్ పరోక్షంగా మద్దతు పలికారు. తమ ప్యానెల్ విజయం సాధించడం పట్ల కర్ర రాజశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే కృష్ణారావుకు అరికెపూడి గాంధీ బహిరంగ సవాల్



హైదరాబాద్ పెన్ పవర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. పరస్పర విమర్శలకు దిగడంతో రాజకీయ వేడి రాజుకుంది. ఈ క్రమంలోనే కృష్ణారావుకు, అరికెపూడి గాంధీ బహిరంగ సవాల్ విసిరారు. ఇద్దరి ఆస్తులపై విచారణకు సిద్ధమా?అని నిలదీశారు. తాను రాజకీయాల్లోకి వచ్చాక భూమి కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు." 2008లో నా భూమి ఎస్ఎఫ్‌సీ భూముల్లో ఉందని ఆరోపణలు వచ్చాయి. నా భూమికి ఎస్ఎఫ్‌సీ భూమికి సంబంధం లేదని ఆ తర్వాత హైకోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్యే కృష్ణారావు ఆరోపణల్లో వాస్తవం లేదు. ఈ విషయంలో ఆయనతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా. కృష్ణారావు అక్రమాలు త్వరలోనే బయటపెడతాను" అని అరికెపూడి గాంధీ అన్నారు.

# అక్టోబర్లో 5,726 కోట్లు జీఎస్టీబీ తెలంగాణకు పండుగ బూస్ట్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో దేశంలో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే ఈ అక్టోబర్లో రాష్ట్రం 10 శాతం వృద్ధిని సాధించింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, తెలంగాణ అక్టోబర్లో ?5,726 కోట్లు జీఎస్టీగా వసూలు చేసింది. ఇదే వృద్ధిరేటును కర్ణాటక కూడా నమోదు చేసింది. దసరా, దీపావళి పండుగల సీజన్లో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో రాష్ట్రానికి రికార్డు స్థాయి ఆదాయం లభించింది. గత సంవత్సరం ఇదే నెలలో ?5,211 కోట్లు వసూలు కాగా, ఈసారి ?515 కోట్ల పెరుగుదల నమోదైంది. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు ?1,45,052 కోట్లకు చేరగా, ఇది 2 శాతం వృద్ధిగా ఉంది. ఐజీఎస్టీ (ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ) సెటిల్మెంట్ల కింద తెలంగాణకు ఈ ఏడాది అక్టోబర్ వరకు ?26,334 కోట్లు బదిలీ అయ్యాయని, ఇది గత ఏడాది ?25,306 కోట్లతో పోలిస్తే 4 శాతం పెరిగిందని కేంద్రం తెలిపింది.




**నవంబర్ కీలక పరీక్షగా భావన**

ఆర్థిక నిపుణులు నవంబర్ వసూళ్లు కీలక సూచీగా ఉంటాయని పేర్కొన్నారు. "పండుగ సీజన్ అమ్మకాలు రేటు తగ్గింపుల వల్ల కలిగే నష్టాన్ని తాత్కాలికంగా సమతుల్యం చేశాయి. నవంబర్ గణాంకాలు ఈ ధోరణి కొనసాగుతుందో లేదో చూపిస్తాయి" అని ఒక ఆర్థిక నిపుణుడు వ్యాఖ్యానించారు.

**రేటు తగ్గింపును పండుగ అమ్మకాలు భర్తీ చేశాయి**

గత నెల 22న జీఎస్టీ కౌన్సిల్ కొన్ని వస్తువుల పన్ను రేట్లను 12%, 28% నుంచి వరుసగా 5%, 18%కు తగ్గించింది. దీంతో 90% వస్తువులు తక్కువ పన్ను శ్రేణిలోకి వచ్చాయి. వినియోగదారులకు ఉపశమనం కలిగించినా, ప్రభుత్వ ఆదాయంపై కొంత ప్రభావం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, పండుగ సీజన్లో ఎలక్ట్రానిక్స్, వాహనాలు, దుస్తులు, గృహోపకరణాల కొనుగోళ్లు పెరగడంతో తెలంగాణ వసూళ్లు మెరుగుపడ్డాయి. "తగ్గిన పన్ను రేట్లను అధిక కొనుగోళ్లు భర్తీ చేశాయి" అని నిపుణులు తెలిపారు. అధికారులు నవంబర్లో వసూళ్లు ?5,200 కోట్లు దాటితే రేటు తగ్గింపుల ప్రభావం తక్కువగానే ఉంటుందని, కానీ వసూళ్లు ?4,998 కోట్లకు సమీపిస్తే ప్రభావం స్పష్టమవుతుందని అంచనా వేస్తున్నారు.

# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన హోటల్.. ఒక రాత్రి బస ఖర్చు తెలిస్తే షాకే!



హైదరాబాద్ పెన్ పవర్:సాధారణంగా హోటల్స్ లో రూమ్ ఖరీదు ఎంత ఉంటుంది? వెయ్యి రూపాయల నుంచి మొదలై లక్ష వరకూ ఉంటుందని అంటారు. మరీ పెద్ద స్టార్ హోటల్ అయితే 5 లక్షల వరకూ ఉండొచ్చని చెబుతారు. కానీ ఇప్పుడు చెప్పుకోబోయే హోటల్ లోని సూట్ లో ఒక రాత్రి బసచేయాలంటే సుమారు 90 లక్షల రూపాయలవరకూ చెల్లించాల్సి ఉంటుంది. దాని ప్రత్యేకతలేమిటో ఇప్పుడు చూద్దామ్..!

అవును.. స్విట్జర్లాండ్ లోని జెనీవాలో ఉన్న హోటల్ ప్రెసిడెంట్ విల్సన్ లోని రాయల్ పెంట్ హౌస్ సూట్.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన హోటల్ సూట్ గా పేరు సంపాదించుకుంది. ఇక్కడ రాత్రికి %వి%80,000–100,000 (సుమారు రూ.70 నుంచి రూ.88 లక్షలు!) చెల్లించాల్సి ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులను స్వాగతించింది.ఇందులో విశాలమైన సూట్ హోటల్ మొత్తం ఎనిమిదవ అంతస్తును విస్తరించి సుమారు 1,680 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. రాయల్ పెంట్ హౌస్ సూట్ హోటల్ ప్రెసిడెంట్ విల్సన్ ఎనిమిదవ అంతస్తులో దాని 12 బెడ్ రూమ్ లు, 12 పాలరాయి బాత్రూమ్ లు, విశాలమైన లివింగ్ ఏరియాతో నిండి ఉంటుంది. ఇదే సమయంలో ఈ ఫ్లోర్ కోసం ప్రత్యేకంగా ప్రైవేట్ లిఫ్ట్ లు ఉంటాయి.ఇదే క్రమంలో మెరుగైన భద్రత కోసం బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, గ్రాండ్ పియానో వంటి విలాసవంతమైన సౌకర్యాలను కూడా అందిస్తుంది. సూట్ లో బస చేసే అతిథుల కోరికలు, ప్రత్యేక అభ్యర్థనలను తీర్చడానికి 24 గంటలూ సేవలో ఉండే వ్యక్తిగత సహాయకుడు, చెఫ్, బట్లర్ కూడా ఉన్నారు.ఈ హోటల్ ది మైండ్ ఎస్కేప్ నుండి 5 నిమిషాల నడక దూరంలో, పాక్విస్ బాత్స్ కు దగ్గరగా ఉంది. లేక్ జెనీవా దగ్గర ఉన్న ఇది పార్క్ డి లా పెర్లే డు లాక్ నుండి కేవలం 0.9 కి.మీ దూరంలో ఉంది. సమీపంలోని షాపింగ్ లో మనోర్ జెనీవ్ డిపార్ట్మెంట్ స్టోర్, హోటల్ ప్రెసిడెంట్ విల్సన్ నుండి త్వరిత డ్రైవ్ దూరంలో ఎ లగ్జరీ కలెక్షన్ హోటల్ ఉన్నాయి.

ఇక ఇక్కడున్న మిచెలిన్ స్టార్ చెఫ్ లు అత్యుత్తమ స్థానిక పదార్థాలను ఉపయోగించి ప్రపంచ స్థాయి వంటకాలను తయారు చేస్తారు. సొగసైన వాతావరణం, అసాధారణమైన ఆహారం, సేవలను ఇది అందిస్తుంది. ఇదే క్రమంలో ఇది అత్యున్నత స్థాయి సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన స్పాను కూడా కలిగి ఉంది. ఇది ది బుర్జ్ అల్ అరబ్, ది రిట్జ్ పారిస్ వంటి ప్రపంచ దిగ్గజాలకు పోటీగా నిలుస్తుంది.

**ది మార్క్ హోటల్ – ది మార్క్ పెంట్ హౌస్!:**

హోటల్ ప్రెసిడెంట్ విల్సన్ తర్వాత ఈ హోటల్ అమెరికాలోనే అతిపెద్ద హోటల్ సూట్ అనే పేరును కలిగి ఉంది. ఇది 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇది అత్యంత అద్భుతంగా ఉండటంతో పాటు.. ఐదు బెడ్ రూమ్ లు, ఆరు పూర్తి స్నానపు గదులు కలిగి ఉంది. అడ్డంకులు లేని వీక్షణలను అందించే బహిరంగ పైకప్పు టెర్రస్ ను కలిగి ఉంది.

**బుర్జ్ అల్ అరబ్ – రాయల్ సూట్:**

బుర్జ్ అల్ అరబ్ – రాయల్ సూట్ ను సాధారణంగా ప్రపంచంలోని ఏకైక ఏడు నక్షత్రాల హోటల్ అని పిలుస్తారు. రాయల్ సూట్ అనేది 24-క్యారెట్ బంగారు అలంకరణలు, ఒక ప్రైవేట్ లైబ్రరీ, తిరిగే మంచంతో అలంకరించబడిన రెండు అంతస్తుల కళాఖండం.

**పామ్స్ క్యాసినో రిసార్ట్ ఎంపాటి సూట్:**

ప్రముఖ కళాకారుడు డామియన్ హిర్స్ట్ రూపొందించిన ఎంపతి సూట్ ఎట్ పామ్స్ క్యాసినో అద్భుతంగా ఉంటుంది. సుమారు 9,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ సూట్ లో రెండు బెడ్ రూమ్ లు, ఒక ప్రైవేట్ పూల్, కస్టమ్ మేడ్ ఫర్నిచర్ ఉన్నాయి.

## షాద్నగర్లో తీవ్ర ఉద్రిక్తత.. మహిళా కానిస్టేబుల్పై విద్యార్థినుల దాడి



హైదరాబాద్ పెన్ పవర్:రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఘర్షణకు దారితీసింది. ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు పట్టణ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆందోళనను అదుపు చేసేందుకు యత్నించిన ఓ మహిళా కానిస్టేబుల్పై విద్యార్థినులు దాడి చేశారు.వివరాల్లోకి వెళితే, కళాశాల ప్రిన్సిపల్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్కు, విద్యార్థినులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమె ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది.ఆగ్రహానికి గురైన తోటి విద్యార్థినులు ఏకమై మహిళా కానిస్టేబుల్పై తిరగబడ్డారు. "న్యాయం చేయమని అడిగితే మమ్మల్నే కొడతారా?" అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అనూహ్య పరిణామంతో పోలీసులు, స్థానికులు నిశ్చేష్టులయ్యారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్యలు విని, పరిష్కారం చూపే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు తేల్చిచెప్పారు.

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొందరు విద్యార్థినులను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో షాద్నగర్ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థినుల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ప్రిన్సిపల్పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై కూడా కాసేపు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది.

# కవిత సమక్షంలో జాగృతి లో చేరిక

హైదరాబాద్ పెన్ పవర్:మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండల్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు ఆదివారం రోజున కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారంతా తెలంగాణ జాగృతిలో చేరడం అభినందనీయమని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలోఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో తెలంగాణ జాగృతి ముందుండి పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. తెలంగాణ జాగృతిలో చేరిన జంగిలి శ్రీనివాస్ కురుమ మాట్లాడుతూ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేక లలిత యాదవ్ సూచనలతో తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తూ స్థానిక సమస్యలపై ముందుండి పోరాడుతామని అన్నారు.గొరిగే నరసింహ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతిలో చేరిన వారిలో మంగళంపల్లి తిరుపతి రుద్రవెల్లి బబ్లు చారి, ఆకవరం బాలు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కాశీబుగ్గ విషాదం.. 95 ఏళ్ల వృద్ధ భక్తుడి స్టోరీ తెలుసుకోవాల్సిందే..



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శ్రీవెంకటేశ్వర ఆలయంలో ఘోర దుర్ఘటన తర్వాత ఆ ఆలయ ప్రత్యేకతలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఎన్నో ఆలయాలు ఉండగా, ఎక్కడా లేనట్లు వేల మంది భక్తులు ఆ ఆలయానికి ఎందుకు వెళ్లారు? తొక్కిసలాటకు దారి తీసిన పరిస్థితులకు కారణాలు ఏమైవుంటాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో ఆలయ యాజమాన్యంపై ఆసక్తికర అంశాలు వెలుగుచూస్తున్నాయి. స్వామివారిపై భక్తితో 95 ఏళ్ల వృద్ధుడు హరి ముకుంద పండా ఆ ఆలయాన్ని నిర్మించారు. అందుకు అయిన వ్యయం మొత్తం ఆయన కుటుంబమే భరించడం విశేషంగా చెబుతున్నారు.

పలాస–కాశీబుగ్గ పట్టణంలోని అత్యంత ఖరీదైన 12 ఎకరాల భూమిలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు మరికొన్ని ఆలయాలను నిర్మించారు. మహావిష్ణువు దశావతరాలను ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమితోపాటు నిర్మాణానికి అవసరమైన డబ్బు పూర్తిగా హరి ముకుంద పండా కుటుంబమే సమకూర్చింది.

ఒడిశాకు చెందిన రాజ వంశానికి హరి ముకుంద పండా కుటుంబం కొన్ని దశాబ్దాలుగా కాశీబుగ్గలో స్థిరపడిందని స్థానికులు చెబుతున్నారు. వీరికి పట్టణంలో సుమారు వంద ఎకరాల భూమి ఉండగా, అందులో 12 ఎకరాలను ఆలయ నిర్మాణం కోసం కేటాయించారు. ఇందుకోసం ఆ భూమిని వెంకటేశ్వరస్వామి పేరున రిజిస్టర్ చేయించారు.

ఖరీదైన భూమిలో ఒక్క రూపాయి కూడా విరాళం కింద సేకరించకుండా హరి ముకుంద పండా వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించడానికి కేవలం భక్తి ఒక్కటే కారణంగా చెబుతున్నారు. తిరుమల శ్రీవారికి పరమ భక్తుడైన పండా.. కొన్నేళ్ల క్రితం తిరుమల వెళ్లగా దర్శనం సరిగా అవ్వలేదు. సుమారు 9 గంటల పాటు దర్శనం కోసం నిరీక్షించాల్సిరావడం, కేవలం ఒక్క నిమిషం కూడా దేవుడిని మనస్ఫూర్తిగా దర్శించుకోలేదన్న ఆవేదనతో ఆయన ఇంటికి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని తన తల్లి అయిన శతాధిక వృద్ధురాలు హరి ప్రియ పండా (సుమారు 110 ఏళ్లు)తో పంచుకోగా, శ్రీవారిని తనివి తీరా ప్రార్థించుకోడానికి సొంతంగా ఆలయ నిర్మించాలని ఆమె సూచించినట్లు సమాచారం.

గతంలో ఈ విషయాన్ని పలు పత్రికలు, మీడియా చానళ్లకు హరి ముకుంద పండా స్వయంగా వెల్లడించారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన పండా కుటుంబం.. ఏటా సేద్యం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ఆలయానికి వెచ్చించి భారీ ఆలయాన్ని నిర్మించింది. దాదాపు ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగాయి. నాలుగు నెలల క్రితమే పూజల కోసం భక్తులను అనుమతించినట్లు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా ఈ ఆలయానికి రెండు నుంచి మూడు వేల మంది మాత్రమే వస్తున్నారు. కానీ, నవంబరు 1న 25 వేల మంది తరలివచ్చారు.

భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి తరలిరావడానికి ఎన్నో ప్రత్యేక కారణాలు ఉన్నాయి. పండా నిస్వార్థ భక్తితో నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీనివాసుడితో పాటు శివడు, దశావతారాలు, గరుత్మంతుడు, ఆంజనేయ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయం గోడలపై అద్భుతమైన శిల్పాలను తీర్చిదిద్దారు. అచ్చు తిరుమల శ్రీవారి ఆలయం నమూనాలో నిర్మించిన కాశీబుగ్గ ఆలయ ప్రాంగణాన్ని మినీ తిరుపతిగా తీర్చిదిద్దాలని పండా భావించారని చెబుతున్నారు. తిరుమలలో స్వామి వారిని సరిగా దర్శించుకోలేని వారు.. ఇక్కడ నచ్చినంత సేపు స్వామివారిని సేవించేలా ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు తగ్గట్లు నిర్మాణాలు చేయడంతో తక్కువ సమయంలోనే ఎక్కువ ప్రచారమై భక్తుల ఆదరణ పొందింది. ఇక కాశీబుగ్గ ఆలయంలో మూలవిరాట్ తిరుమల విగ్రహాన్ని పోలి ఉంటుంది. తిరుపతి నుంచే 9 అడుగుల 9 అంగుళాల దేవుడి విగ్రహం తెచ్చారు. శ్రీదేవి, భూదేవి విగ్రహాలను తిరుపతిలోనే చేయించారు. మిగిలిన విగ్రహాల కోసం రాజస్థాన్ నుంచి అనేక ఏకశిల విగ్రహాలను తీసుకువచ్చారు. రామాయణ, భాగవత, మహాభారతాలను ఆలయ గోడలపై విగ్రహాల రూపంలో పెట్టించారు. భక్తుల కోసం వసతి గృహాలు, కల్యాణ మండపాలు కూడా నిర్మించారు. గుడి "అందరూ చూడాలి, ఆనందించాలి, పూజించాలని కట్టాం" అని గతంలో ఒకసారి పండా చెప్పారు.

ఇక పండా కుమారుడు ఢిల్లీలో మెడిసిన్ చదువుతున్నారు. తమ కుటుంబం శ్రీనివాసుడికి రాసిచ్చిన భూమిని భవిష్యత్తులో ఎవరూ అనుభవించడానికి వీలు లేదని కూడా పండా చెబుతున్నారు. దేవ దేవుడిపై భక్తితో 95 ఏళ్ల వయసులో మహా సంకల్పంతో నిర్మించిన ఆలయం భక్తుల అత్యుత్సాహం వల్ల తీవ్ర విషాదానికి వేదికగా మారిపోవడం పట్ల సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది.

## వీర్యంతో నెలకు రూ.5 లక్షల సంపాదన.. ఏమిటీ స్పెషల్!



**హైదరాబాద్ పెన్ పవర్:**హర్యానాకు చెందిన అన్మోల్ అనే గేదె మరోసారి ఇంటర్నెట్ దృష్టిని ఆకర్షించింది. 1,500 కిలోగ్రాముల బరువు, రూ. 23 కోట్ల విలువైన ఈ భారీ జంతువు ఎక్కడికి వెళ్ళినా అందరి దృష్టినీ ఆకర్షించడంలో ఎప్పుడూ విఫలం కావడంలేదు. ఈ క్రమంలో... ఇటీవల ప్రసిద్ధ పుష్కర్ మేళాలో అన్మోల్ గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

అవును... అక్టోబర్ 30న ప్రారంభమై నవంబర్ 5 వరకు కొనసాగే ఈ ప్రసిద్ధ పుష్కర్ మేళా ప్రదర్శనలో గత కొన్ని సంవత్సరాలుగా లెక్కలేనన్ని జంతువులను ప్రదర్శించారు.. కానీ, ఈసారి అన్మోల్ మాత్రం అత్యంత ప్రత్యేకంగా నిలిచింది. అన్మోల్ సాధారణ గేదె కాదు. దాని విలువ నమ్మశక్యం కాని స్థాయిలో అన్నట్లుగా అక్షరాలా రూ. 23 కోట్లు. ఆ మొత్తంతో రెండు రోల్స్ రాయిస్ కార్లు, పది మెర్సిడెస్ బెంజ్ వాహనాలు లేదా అనేక భారతీయ నగరాల్లో మంచి ఆస్తిని కూడా కొనుగోలు చేయవచ్చు! దీంతో... ఈ భారీ గేదె సంతలోకి అడుగుపెట్టగానే అందరి కళ్ళు సహజంగానే దాని వైపు మళ్లాయి. ఈ అన్మోల్ కు ఎనిమిది సంవత్సరాలు కాగా.. ఇది హర్యానాలోని సిర్సా జిల్లా నుండి వచ్చింది. దీని అందం మాత్రమే కాదు, పశువుల పెంపకానికి ఉపయోగించే అధిక నాణ్యత వీర్యం కోసం డిమాండ్ కూడా దాన్ని మరింత విలువైనదిగా చేస్తుంది. ఇందులో భాగంగా... దాని యజమాని దీని వీర్యం ద్వారా ప్రతి నెలా సుమారు సుమారు రూ. 5 లక్షలు సంపాదిస్తున్నాడని చెబుతున్నారు. అన్మోల్ ను పెంచడం అంత తేలికైన పని కాదు. దాని రోజువారీ సంరక్షణకు సుమారు రూ. 1,500 ఖర్చవుతుందని చెబుతున్నారు. దీనికి ప్రతిరోజూ 250 గ్రాముల బాదం, 4 కిలోల దానిమ్మ, 30 అరటిపండ్లు, 5 లీటర్ల పాలు, 20 గుడ్లు తినిపిస్తారట. దానితో పాటు నెయ్యి, సోయాబీన్స్, మొక్కజొన్న, ఆయిల్ కేక్, తాజా పచ్చి మేత తింటుందట.

కాగా.. అన్మోల్ తల్లి అధిక దిగుబడినిచ్చే గేదె. అది ప్రతిరోజూ 25 లీటర్ల పాలు ఉత్పత్తి చేయడంలో ప్రసిద్ధి చెందింది. గత సంవత్సరం మీరట్ లో జరిగిన అఖిల భారత రైతు ఉత్సవంలో అన్మోల్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు పుష్కర్ మేళాలో మరోసారి అందరి దృష్టినీ ఆకర్షించింది.

## ఎగిరే కారు తెస్తున్నా: ఎలాన్ మస్క్ మరో సంచలనం



**హైదరాబాద్ పెన్ పవర్:**టెస్లా సీఈవో ఎలాన్ మస్క్.. పేరు వింటేనే విప్లవాత్మక ఆవిష్కరణలు గుర్తొస్తాయి. అంతరిక్షంలో రాకెట్లు పంపే స్పేస్ఎక్స్ అయినా, ఎలక్ట్రిక్ కార్లలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా అయినా... అసాధ్యాలను సుసాధ్యం చేయడంలో మస్క్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే ప్రకటనతో ఆయన టెక్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపారు.

### గాల్లో తేలే కారు!

ప్రముఖ జో రోగన్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మస్క్, టెస్లా నుంచి 'ఎగిరే కారు' ను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రోటోటైప్‌ను ఈ ఏడాదిలోనే ప్రపంచానికి చూపిస్తామని చెప్పడం విశేషం. "మా ఆవిష్కరణ ఊహలకు అందని స్థాయిలో ఉంటుంది. హాలీవుడ్ జేమ్స్ బాండ్ సినిమాల్లో కనిపించే అన్ని కార్ల ఫీచర్లను కలిపినట్టుగా ఉంటుంది" అని మస్క్ వ్యాఖ్యానించారు. అయితే, ఆ కారు డిజైన్, నిర్మాణం వివరాలను మాత్రం ఆయన రహస్యంగానే ఉంచారు. అది రెక్కలతో ఉంటుందా? లేక హెలికాప్టర్ తరహాలో గాల్లోకి లేస్తుందా? అన్న ప్రశ్నలకు మస్క్ స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం ఆసక్తిని పెంచింది.

### గత వాగ్దానాలు.. ప్రస్తుత ఉత్సాహం

నిజానికి, మస్క్ 2014 నుంచే ఎగిరే కార్ల కాన్సెప్ట్‌పై మాట్లాడుతున్నారు. కానీ, ఇప్పటివరకు అది రూపుదిద్దుకోలేదు. తాజాగా ఆయన మరోసారి ఈ ప్రాజెక్ట్‌పై స్పష్టత ఇవ్వడంతో టెస్లా అభిమానుల్లో, టెక్ వర్గాల్లో భారీ ఉత్సాహం నెలకొంది. టెస్లా రెండో జనరేషన్ రోడ్‌స్టర్ స్పోర్ట్స్ కారు విడుదల నేపథ్యంలో ఈ ప్రకటన మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ంమస్క్ మాటల ప్రకారం చూస్తే, టెస్లా ఫ్లయింగ్ కారు భవిష్యత్ రవాణా విధానంలో మరో విప్లవాత్మక మార్పు తీసుకురావొచ్చు.

### నిరీక్షణకు తెరపడుతుందా?

అయితే, గతంలో మస్క్ ప్రకటించిన హైపర్‌లూప్ , రోబో టాక్సీ వంటి కొన్ని ప్రాజెక్టులు వాయిదా పడిన దృష్ట్యా, ఈ ఎగిరే కారు నిజంగానే ఈ ఏడాదిలో ప్రోటోటైప్‌గా రూపుదిద్దుకుంటుందా? అన్నది ఇప్పుడు టెక్ ప్రపంచం ముందున్న అతి పెద్ద ప్రశ్న.

ఏదేమైనా, ఎలాన్ మస్క్ చేసిన ఈ ప్రకటన... టెక్నాలజీ భవిష్యత్తుపై కొత్త ఆశలను, అంచనాలను పెంచింది. మస్క్ మాట నిజమై, ఎగిరే కారు వస్తే, అది రవాణా చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించడం ఖాయం!

# మార్కెట్ లో నయా ట్రెండ్.. అద్దెకు బంగారు నగలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా అమ్మాయిలకి.. బంగారానికి మధ్య విడదీయరాన్ని సంబంధం ఉంటుంది. సందర్భం ఏదైనా సరే ఒంటినిండా నగలు ఉండాల్సిందే. ముఖ్యంగా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలు సాంప్రదాయమైన దుస్తులు ధరించడమే కాకుండా వాటికి అనుకూలంగా బంగారు ఆభరణాలతో తమ అందాన్ని రెట్టింపు చేసుకుంటూ ఉంటారు. అయితే అలాంటి అమ్మాయిలకు ఇప్పుడు భారీ షాక్ తగులుతోందని చెప్పాలి. రోజురోజుకీ బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో సామాన్యులు బంగారం వైపు ఆలోచించడమే మానేశారు. గత వారం రోజులుగా సుమారుగా 11,000 వరకు తగ్గిన బంగారం ధరలు ఇప్పుడు మళ్లీ అనూహ్యంగా పెరిగిపోయి అందరిని ఆశ్చర్యపరుస్తున్నాయి.



ఇక ఇలా బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్న నేపథ్యంలో తాజాగా ఒక కొత్త ట్రెండు మార్కెట్లో మొదలయ్యింది. ఈ ట్రెండ్ చూసి కొంతమంది సంతోషం వ్యక్తం చేస్తే.. మరి కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు బట్టలు, రోల్డ్ గోల్డ్ ఆఖరికి లగ్జరీ కార్లను కూడా అద్దెకు ఇవ్వడం చూసాం.. కానీ ఇప్పుడు ఏకంగా బంగారాన్ని కూడా అద్దెకు ఇస్తున్నారా అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే ఈ కొత్త ట్రెండు. మరి ఈ ట్రెండ్ ఎప్పుడు ఎక్కడ మొదలయ్యింది దీని పూర్తి వివరాలేంటో ఇప్పుడు చూద్దాం..విషయంలోకి వెళ్తే.. ప్రతి వేడుకకు సరికొత్తగా తయారవ్వాలనుకునే ఈతరాన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెట్లో కొన్ని సంస్థలు పార్టీవేర్ డ్రస్సులను, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టాయి. వీటి సహాయంతో తక్కువ ఖర్చుతోనే అనుకున్నట్టుగా తయారయ్యే విధంగా వీలు ఉండడంతో ఈ ట్రెండ్ చాలా వరకు కూడా అందర్నీ ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు ఇదే పద్ధతిని బంగారు దుకాణాలు కూడా ప్రారంభించాయి. కర్ణాటకకు చెందిన శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో బంగారు నగలను కొనుక్కోవడం అమ్ముకోవడమే కాదు అద్దెకు కూడా తీసుకోవచ్చుట. వి గివ్ గోల్డ్ ఆన్ రెంట్ అనే పేరుతో ఈ సర్వీస్ ను అందిస్తున్నారు. చెన్నై , హైదరాబాద్ నగరాలలో కూడా ఈ సంస్థ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అద్దె %జఖ్ఖుఎష్ట్రఱ% ఒక రోజు నుంచి వారం రోజుల వరకు అందుబాటులో ఉంటుంది. దానికి కొన్ని ఖచ్చితమైన నిబంధనలు కూడా ఉంటాయి. ఎవరైతే బంగారు ఆభరణాలను అద్దెకు తీసుకోవాలనుకుంటున్నారో అలాంటివారు ఐడి ప్రూఫ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది . కాబట్టి ఇక బంగారు నగలను తీసుకొని పారిపోయే అవకాశాలు ఉండవు. గడువు పూర్తయిన తర్వాత ఆ నగలను భద్రంగా తెచ్చి అప్పగించాల్సి ఉంటుంది.. ముఖ్యంగా నగ విలువను బట్టి, తీసుకునే రోజులను బట్టి కూడా అద్దె వసూలు చేస్తారు . పైగా నగ ధరను బట్టి డబ్బు కూడా డిపాజిట్ చేయించుకొని ఆ వివరాలన్నింటినీ చెక్ చేశాకే అద్దెకు ఇస్తుంటారు.మొత్తానికి అయితే పెరిగిన బంగారు ధరలను దృష్టిలో పెట్టుకొని ఈ సంస్థ తీసుకొచ్చిన ఈ వినూత్న ట్రెండు మార్కెట్లో బాగా పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక ప్రతిసారి ఒకే నగ ధరించాలా అని ఆలోచించే మహిళలకు.. ధరలు చూసి అమ్మో ఇంత మనం పెట్టి కొనగలమా అని ఆలోచించే వారికి ఇది చక్కటి సదుపాయం అని చెప్పవచ్చు. ఇక ప్రస్తుతం ఈ ట్రెండు అందరిని ఆశ్చర్యపరుస్తోంది .

## పండగ సీజన్ లో రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల జోరు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అక్టోబర్ నెలలో అమ్మకాల్లో సత్తా చాటింది. పండగ సీజన్ డిమాండ్, మార్కెట్‌లో సానుకూల సెంటిమెంట్ కారణంగా గతేడాది ఇదే నెలతో పోలిస్తే మొత్తం విక్రయాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 1,24,951 యూనిట్లను విక్రయించగా, గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 1,10,574 యూనిట్లుగా ఉంది.

కంపెనీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేశీయ అమ్మకాలు 15 శాతం పెరిగి 1,01,886 యూనిట్ల నుంచి 1,16,844 యూనిట్లకు చేరాయి. అయితే, ఎగుమతులు మాత్రం నిరాశపరిచాయి. గతేడాది 8,688 యూనిట్లుగా ఉన్న ఎగుమతులు, ఈసారి 7 శాతం తగ్గి 8,107 యూనిట్లకు పరిమితమయ్యాయి.

ంపండగ సీజన్ ఉత్సాహం దేశవ్యాప్తంగా అమ్మకాలకు ఊతమిచ్చిందని ఐషర్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈఓ బి. గోవిందరాజన్ తెలిపారు. "సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 2.49 లక్షల మోటార్‌సైకిళ్లను విక్రయించి రికార్డు సృష్టించాం. మా కంపెనీ చరిత్రలో పండగ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. మా బ్రాండ్‌పై రైడర్లకు ఉన్న అచంచలమైన అభిమానానికి ఇది నిదర్శనం" అని ఆయన వివరించారు.రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల వృద్ధి, దేశంలోని టూవీలర్ పరిశ్రమ మొత్తం పుంజుకుంటున్న తరుణంలో జరగడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు, పండగ డిమాండ్‌తో టీవీఎస్ మోటార్, సుజుకి మోటార్‌సైకిల్ వంటి ఇతర ప్రముఖ కంపెనీలు కూడా అక్టోబర్‌లో 8 నుంచి 11 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సెంటిమెంట్, కొత్త మోడళ్ల విడుదల వంటి అంశాలు దీపావళికి ముందు టూవీలర్ అమ్మకాలకు మరింత ఊపునిచ్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లాసిక్ 350, బుల్లెట్, హంటర్ 350, హిమాలయన్ వంటి మోడళ్లతో మిడ్-సైజ్ మోటార్‌సైకిల్ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

## తేనె ఎగుమతుల్లో వరల్డ్ నెం.2 మనమే!



**హైదరాబాద్ పెన్ పవర్:**తేనె ఎగుమతుల్లో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద తేనె ఎగుమతిదారుగా అవతరించి తన సత్తా చాటింది. 2020లో 9వ స్థానంలో ఉన్న భారత్.. అనూహ్యమైన వృద్ధిని సాధించి ఈ ఘనతను అందుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశం నుంచి 1.07 లక్షల మెట్రిక్ టన్నుల సహజసిద్ధమైన తేనె ఎగుమతి కాగా, దీని విలువ 177.55 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,480 కోట్లు) అని కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'తీపి విప్లవం' (%వాౌషవవ్ =వజశీశ్రీబ్‌ఱశీఅ%) ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. దేశంలో తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయంగా ప్రోత్సహించడం, నాణ్యమైన తేనె ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా 'నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్' (%చీదీఎవీ%)ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2020-21 నుంచి 2022-23 వరకు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనికి లభించిన ఆదరణతో, మిగిలిన రూ. 370 కోట్ల బడ్జెట్‌తో మరో మూడేళ్లపాటు (2025-26 వరకు) పొడిగించారు.

తేనెటీగల పెంపకం కేవలం తేనె ఉత్పత్తికే పరిమితం కాదు. ఇది వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట పొలాల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పంటల దిగుబడి పెరిగి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. తేనె మాత్రమే కాకుండా, మైనం, బీ పోలెన్, రాయల్ జెల్లీ వంటి ఇతర విలువైన ఉత్పత్తులు కూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, భూమిలేని నిరుపేదలకు అదనపు ఆదాయ వనరుగా మారాయి.ఈ మిషన్‌ను మూడు ఉప-మిషన్లుగా విభజించి అమలు చేస్తున్నారు. మొదటిది, శాస్త్రీయ పెంపకం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచడం. రెండోది, తేనె సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. మూడోది, వివిధ ప్రాంతాలకు అనువైన పరిశోధనలు, సాంకేతికతను అభివృద్ధి చేయడం. తేనె నాణ్యతను, అది ఎక్కడ తయారైందో తెలుసుకునేందుకు 'మధుక్రాంతి' అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు తేనెటీగల పెంపకానికి విస్తృత అవకాశాలు కల్పిస్తుండటంతో, భవిష్యత్తులో భారత్ ఈ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.